

జిల్లా కేంద్రంలోని పెద్ద పోచమ్మ ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

# ఘనంగా నాగుల పంచమి


- కిటకిటలాడిన ఆలయాలు
- కొనసాగిన ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- పుట్టల్లో పాలుపోసిన భక్తులు

**ఉమ్మడి జిల్లాలో** శుక్రవారం నాగపంచమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల ప్రాంగణాల వద్ద, గ్రామశివారులో ఉన్న పుట్టల్లో భక్తులు పాలుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆడపిల్లలు తమ అన్నదమ్ములకు ఆవుపాలతో కండ్లు కడిగి ఆశీర్వాదాలు తీసుకున్నారు. జిల్లా కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆవుపాలను ఉచితంగా పంపిణీ చేశారు.

## కామారెడ్డి జిల్లాలో మరో మూడు
# కొత్త పంచాయతీలు

**గాంధారి మండలం పీస్కీల్ గుట్ట తండా, నాగిరెడ్డిపేట మండలం కన్నారెడ్డి, చిన్న ఆత్మకూర్ గ్రామాలు**

గాంధారి/నాగిరెడ్డిపేట, ఆగస్టు 9: జిల్లాలో మరో మూడు గ్రామ పంచాయతీలను కొత్తగా ఏర్పాటు చేశారు. గాంధారి మండలంలోని పిస్కీల్ గుట్ట తండాను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదలైనట్లు ఎంపీడీవో రాజేశ్వర్ శుక్రవారం తెలిపారు. గాంధారి మండలంలో ఇప్పటి వరకు 44 గ్రామ పంచాయతీలు ఉండగా..45వ పంచాయతీ పీస్కీల్ గుట్ట తండాను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలో కన్నారెడ్డి, చిన్న ఆత్మకూర్ గ్రామాలు నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. తమ గ్రామాలు నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేయడంపై ఆ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



# 'ఇంజినీరింగ్' కలేనా!

**ప్రభుత్వ కళాశాల ఏర్పాటుపై నిర్లక్ష్యం**

- ప్రైవేట్ కాలేజీలను ఆశ్రయిస్తున్న ఉమ్మడి జిల్లా విద్యార్థులు
- లోక్‌సభ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ
- అధికారంలోకి వచ్చినా పట్టించుకోని రేవంత్ సర్కార్
- 'నిజామాబాద్ పాలిటెక్నిక్'లో ఏర్పాటుకు యోచన
- ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభం కష్టమే!



నిజామాబాద్, ఆగస్టు 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పేద విద్యార్థులకు సాంకేతిక విద్య అందని ద్రాక్షగా మారుతున్నది. ఉమ్మడి జిల్లాలో ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలలే శరణ్యం. ఉత్తర తెలంగాణలో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ఎంతో పేరు పొందిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఒక్క ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల కూడా లేకపోవడం గమనార్హం. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నది. దీనిపై కేసీఆర్ అధికారికంగా వెల్లడించే క్రమంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ సైతం ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇచ్చింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి ఈ విషయాన్ని ప్రస్తావించగా.. సీఎం రేవంత్ రెడ్డి సైతం సుముఖత వ్యక్తం చేశారు. కానీ అధికారంలోకి వచ్చినా ఇంత వరకూ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు ప్రక్రియపై అతీగతీ లేకుండా పోయింది. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులు ఎంసెట్ రాసిన తర్వాత ఇతరత్రా జిల్లాలకు పయనమవుతున్నారు.మంచి ర్యాంకులు వచ్చినా ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడంతో గత్యంతరంలేక ప్రైవేటు కళాశాలలను ఎంపిక చేసుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లాలో మూడు ఇంజినీరింగ్ కళాశాలలు ప్రైవేటులోనే కొనసాగుతుండగా.. కామారెడ్డిలో ఒకటి ఉండగా దానిని మూసివేశారు. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థి లోకం డిమాండ్ చేస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు.

## టీయూలో అనుకూల అంశాలు

తెలంగాణ యూనివర్సిటీని 2006లో ప్రారంభించగా..మొదట ఆరు కోర్సులు ప్రవేశపెట్టారు. డిచ్‌పల్లికి క్యాంపస్ మారిన తర్వాత సువిశాలమైన ప్రాంతంలో కొత్త కోర్సులు వచ్చి చేరాయి. 2019-20 విద్యా సంవత్సరానికి మొత్తం 31 కోర్సులతో వేలాది మందికి వర్సిటీ విద్యను అందిస్తున్నది. అత్యుత్తమమైన ప్రమాణాలతో ఇక్కడ విద్యాభ్యాసం కొనసాగుతున్నది. టీయూ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మధ్య సమన్వయంలోపం ఉన్నప్పటికీ పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన చదువు ఇక్కడ అందుతున్నది. డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి, నడిపల్లి గ్రామ శివారులో మొత్తం 577 ఎకరాల్లో తెలంగాణ యూనివర్సిటీ నెలకొని ఉన్నది. వర్సిటీ విస్తరణ నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలంతా ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చారు. కానీ అనివార్య కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలోనైనా ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు అడుగు ముందుకు పడాలని ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు కోరుకుంటున్నారు. టీయూలో ఉన్న భూ లభ్యతతోపాటు రైల్వే, జాతీయ రహదారి -44 అనుకూలతలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. దీనికి తోడుగా ఫ్యాకల్టీ, పరిపాలన సిబ్బంది కూడా పూర్తి స్థాయిలో ఉన్నారు.

## నిజామాబాద్ పాలిటెక్నిక్ ఉన్నతీకరణ!

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఒక కీలక ప్రకటన చేశారు. ఎమ్మెల్యేగా తాను ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి ఇంజినీరింగ్ కళాశాలను తొలుత మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో పలు జిల్లాల్లో ఇంజినీరింగ్ కాలేజీ స్థాపనపైనా ప్రకటన చేశారు. ఇందులో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కాలేజీ సైతం ఉన్నది. ఇప్పుడిక్కడ పదో తరగతి అనంతరం పాలిసెట్ తర్వాత మూడేండ్ల డిప్లొమా కోర్సుల్లో విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యను అందిస్తున్నారు. ఇదంతా ప్రాథమిక స్థాయిలోనే జరిగే విద్యా బోధన కావడంతో పాలిటెక్నిక్‌లోనే ఇంజినీరింగ్ ఉన్నతీకరణ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. పాలిటెక్నిక్ కాలేజీలో విద్యాభ్యాసం ముగిసిన తర్వాత డిప్లొమా విద్యార్థులంతా తిరిగి ఈ-సెట్ ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. తద్వారా తిరిగి ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగేండ్ల కోర్సులో నేరుగా రెండో సంవత్సరంలో చేరాల్సి ఉంటుంది. పాలిటెక్నిక్ ఉన్నతీకరణ చేయడం ద్వారా ఎంసెట్ ద్వారా ఇంజినీరింగ్ కోర్సుల్లోకి వచ్చే వారికి లాభం జరుగుతుందా? లేదా? అనే దానిపై స్పష్టత లేదు. మరోవైపు ప్రస్తుతం నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో సరిపడా స్థలం లేదు. ప్రస్తుతం ఉన్న ఖాళీ స్థలాన్ని నగరవాసుల అవసరాలు, పలు క్రీడలకు వినియోగిస్తున్నారు.

## పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా..



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎక్కడా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లేకపోవడం అన్నది ఈ ప్రాంత విద్యార్థులకు ఇబ్బందికరమైన పరిస్థితినే తెలియజేస్తోంది. చాలా మంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి ఇంజనీరింగ్ విద్య అందని ద్రాక్షలా మారుతోంది. ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేంత స్తోమత లేని పేద కుటుంబాలకు తీరని అన్యాయం జరుగుతోంది.

**- సునీల్, ఏబీవీపీ కన్వీనర్, నిజామాబాద్ జిల్లా**

## ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలి. ఎన్నికల్లో ప్రకటనలు చేసినంత వేగం గా ఈ అంశంపై ముందడుగు పడకపోవడం బాధాకరం. ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయడానికి మన ప్రాంతంలో అనేక అనుకూలతలు ఉన్నాయి.

**- శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్వీ నాయకుడు**

# నోట్ల గుట్టలు రూ.కోట్లల్లో ఆస్తులు

- నగదు లెక్కించేందుకే ఐదు గంటలు..
- మున్సిపల్ ఉద్యోగి వద్ద కళ్లు చెదిరే సంపద
- అక్రమంగా పోగేసిన అవినీతి తిమింగలం
- రూ.ఆరు కోట్లకు పైగా ఆస్తులు లభ్యం
- కట్టలు చూసి బిత్తరపోయిన ఏసీబీ అధికారులు
- సూపరింటెండెంట్ నరేందర్ అరెస్టు



అరెస్టయిన మున్సిపల్ ఉద్యోగి నరేందర్



నరేందర్ ఇంట్లో లభ్యమైన నగదు, బంగారు ఆభరణాలు

వినాయక్‌నగర్/కంఠేశ్వర్, ఆగస్టు 9: గుట్టల కొద్దీ నోట్ల కట్టలు.. రూ.కోట్లల్లో ఆస్తులు.. పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు.. మున్సిపాలిటీలో పని చేసే ఓ ఉద్యోగి ఇంట్లో లభ్యమైన సంపదను చూసి ఏసీబీ అధికారుల కళ్లు బైర్లు కమ్మాయి. నిజామాబాద్ బల్దియా సూపరింటెండెంట్ (ఇన్‌చార్జి ఆర్‌వో)గా పని చేస్తున్న దాసరి నరేందర్ పాపం పడింది. దశాబ్ద కాలంగా కార్పొరేషన్‌ను గుప్పిట పట్టి అక్రమార్జనకు పాల్పడుతున్న అవినీతి అనకొండ ఎట్టకేలకు ఏసీబీ వలకు చిక్కింది. సదరు అధికారి దోచుకున్న సంపాదనను చూసి ఆశ్చర్యపోవడం అధికారుల వంతయింది. పట్టుబడిన నోట్లను లెక్కించేందుకే ఐదు గంటలకు పైగా సమయం పట్టిందంటే సారు గారి అక్రమ సంపద ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. ఈ స్థాయిలో అక్రమార్జన ఎప్పుడూ చూడలేదని, ఏసీబీ దాడుల్లో ఇంత మొత్తంలో పట్టుబడడం ఇదే మొదటి సారి అని అధికారులు చెబుతున్నారు.

### ఏసీపీ డీజీపీ ఆదేశాలతో..

దశాబ్ద కాలంగా కార్పొరేషన్‌లో తిష్ట వేసిన నరేందర్ అవినీతికి అంతే లేకుండా పోయింది. ఇతగాడి అక్రమార్జన ఏకంగా ఏసీబీ డీజీపీ సీవీ ఆనంద్ వద్దకు చేరింది. ఆయన ఆదేశాలతో అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించారు. శుక్రవారం తెల్లవారుజామునే నరేందర్, సంబంధీకుల ఇళ్లల్లో ఏకకాలంలో దాడులు చేశారు. నిజామాబాద్, మెదక్ జిల్లాలకు చెందిన 25 మంది అధికారులతో కూడిన బృందాలు నరేందర్ ఇల్లు, చాంబర్‌తో పాటు కోటగల్లిలో ఉండే తల్లి నివాసంలో, నిర్మల్ జిల్లాలోని అత్తగారింట్లో సోదాలు నిర్వహించాయి. సుమారు 11 గంటలకు పైగా సాగిన తనిఖీల్లో గుట్టల కొద్దీ నోట్ల కట్టలు బయట పడ్డాయి. కౌంటింగ్ మిషన్లతో లెక్కించేందుకే ఐదు గంటలకు పైగా సమయం పట్టినట్లు తెలిసింది. రూ.2.93 కోట్ల నగదుతో పాటు రూ.6 లక్షల విలువైన 51 తులాల బంగారం, రూ.1.98 కోట్ల విలువ చేస్తే ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, భార్య, తల్లి పేరిట బ్యాంకుల్లో ఉన్న బ్యాలెన్స్ రూ.1.10 కోట్లను సీజ్ చేశారు.

### రూ.6.07 కోట్ల ఆస్తులు సీజ్

ఇన్‌చార్జి ఆర్‌వో నరేందర్ ఆస్తుల వివరాలు సేకరించేందుకు సోర్స్ రిపోర్టు దాడులు చేశామని ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. అతని ఇంట్లో నుంచి రూ. 6.07 కోట్లకు పైగా నగదు, ఆభరణాలు, బ్యాంకు బ్యాలెన్స్, ఆస్తి పత్రాలను సీజ్ చేశామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఆర్ఐ చాంబర్ నుంచి రూ.90 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నరేందర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. తనిఖీల్లో నిజామాబాద్, మెదక్ జిల్లాలకు చెందిన ఇన్‌స్పెక్టర్లు నగేశ్, శ్రీనివాస్, వేణు కుమార్, రమేశ్, వెంకటేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేషన్‌లో కలకలం

- ఏసీబీ దాడులతో అక్రమార్కుల్లో గుబులు
- బల్దియాను గుప్పిట పట్టిన నరేందర్
- ఉన్నతాధికారులను సైతం శాసించే స్థాయికి..

కంఠేశ్వర్, ఆగస్టు 9: అవినీతి నిరోధక శాఖ దాడులతో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో శుక్రవారం కలకలం రేగింది. అత్యంత వివాదాస్పదుడిగా పేరొందిన సూపరింటెండెంట్, ఇన్‌చార్జి ఆర్‌వో నరేందర్ ఏసీబీకి చిక్కడంతో అక్రమార్కుల్లో గుబులు మొదలైంది. మరోవైపు, ఇన్నాళ్లు బల్దియాను గుప్పిట పట్టి శాసించిన అవినీతి తిమింగలం పట్టుబడడంతో ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తమైంది. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో నరేందర్ ఇంటితో పాటు బల్దియాలోని చాంబర్‌లో ఏసీబీ అధికారులు తనిఖీ చేయడంతో కార్పొరేషన్‌లో టెన్షన్ నెలకొంది. ప్రతి పనికీ డబ్బులు వసూలు చేస్తున్న బల్దియా అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. సోదాలు జరిగినంత సేపూ ఆయా ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ గడిపారు.

### ఆది నుంచి వివాదాస్పదుడే..

మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్‌గా చేరిన నరేందర్ అంచెలంచెలుగా సూపరింటెండెంట్ స్థాయికి ఎదిగాడు. ఈ క్రమంలో మొత్తం కార్పొరేషన్‌నే శాసించే స్థాయికి చేరాడు. అయితే, నరేందర్ వ్యవహార శైలి ఆది నుంచి అత్యంత వివాదాస్పదంగా ఉండేది. బిల్ కలెక్టర్‌గా ఉన్నప్పుడే వృద్ధురాలి పింఛన్ కాజేసిన ఆరోపణలతో సస్పెండ్ కూడా అయ్యాడు. అతడి అవినీతిపై గతంలో ఇక్కడ పనిచేసిన కొందరు ఉన్నతాధికారులు నరేందర్‌ను తీవ్రంగా మందలించి చర్యలు తీసుకున్నారు. బోధన్ మున్సిపాలిటీకి బదిలీ చేస్తే పై స్థాయిలో లాబీయింగ్ చేసుకుని తిరిగి నిజామాబాద్‌లోనే కొనసాగేలా ఉత్తర్వులు తెచ్చుకున్నాడు.

### ఉన్నతాధికారులు సైతం..

కొందరి అండతో పదేండ్లుగా బల్దియాలో పాతుకుపోయిన నరేందర్ ఉన్నతాధికారులను సైతం మచ్చిక చేసుకునే వాడన్న పేరుంది. అతని కంటే పైస్థాయి అధికారి ఏ పని చేయాలన్నా నరేందర్ ఆశీస్సులు ఉండాల్సిందేనన్న విచిత్ర పరిస్థితి బల్దియాలో నెలకొంది. ఉద్యోగులను కమిషనర్ పేరు చెప్పి బెదిరించే వాడు.. ఉన్నతాధికారులను మరో విధంగా మచ్చిక చేసుకునే వాడు. ఈ క్రమంలో అతడి అవినీతిపై సామాన్యులతో పాటు కార్పొరేటర్లు సైతం వందల సంఖ్యలో ఫిర్యాదులు చేసినా పై స్థాయి అధికారులు పట్టించుకోలేదు. దీంతో నరేందర్ అక్రమార్జనకు అంతే లేకుండా పోయింది. చివరకు అవినీతి తిమింగలం పట్టుబడడంతో బల్దియా ఉద్యోగులు సంతోషంలో మునిగిపోయారు. నరేందర్ లాంటి మరికొందరి అధికారుల ఆట కట్టించాలని కోరుతున్నారు.

# రుణమాఫీ కాలేదు.. కనికరించండి

**కలెక్టర్‌కు రెంజల్ రైతుల విన్నపం**



కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రెంజల్. ఆగస్టు 9: అర్హులమైన తమకు రుణమాఫీ కాలేదని, కనికరించి రుణాలు మాఫీ చేయాలని నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల రైతులు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం పలువురు రైతులు కలెక్టరేట్‌కు వచ్చి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం రూ.లక్షన్నర లోపు పంట రుణాలను మాఫీ చేయగా, కెనరా బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రుణమాఫీ వర్తించలేదని వాపోయారు. స్పందించిన కలెక్టర్ మాఫీ కాని రైతుల జాబితాను రెండ్రోజుల్లో సమర్పించాలని బ్యాంక్ అధికారులను ఆదేశించారు. ఈ సమస్యను వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిపిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని రైతులు తెలిపారు.

# 'రుణమాఫీ'పై సిబ్బంది నిర్లక్ష్యం

- సిరికొండ విండోలో ప్రత్యేకాధికారి విచారణ
- హాజరుకాని మాజీ కార్యదర్శులు
- ప్రస్తుత కార్యదర్శి మహ్మద్ ఆలీ సస్పెన్షన్



విండో డైరెక్టర్లతో మాట్లాడుతున్న విచారణ అధికారి పోశన్న

సిరికొండ, ఆగస్టు 9: సిరికొండ, తూంపల్లి సొసైటీ పరిధిలో 153 మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో సిరికొండ విండోలో డీసీవో కార్యాలయ సీనియర్ సూపరింటెండెంట్ పోశన్న శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ విచారణకు మాజీ కార్యదర్శులు హాజరుకాలేదు. తమకు నోటీసులు రాకుండా హాజరుకాబోమని కార్యదర్శులు తెలిపారు. సొసైటీలో అవకతవకలు జరిగాయని కొంతకాలంగా వస్తున్న ఆరోపణల నేపథ్యంలో విచారణ చేపట్టినట్లు పోశన్న తెలిపారు. రెండురోజుల్లో నోటీసులు జారీ చేసి తిరిగి విచారణ చేపడుతామన్నారు. రుణమాఫీకి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో నెలరోజులు ఆలస్యమైందని సొసైటీ కార్యదర్శి మహ్మద్ ఆలీని సస్పెండ్ చేయాలంటూ పాలకవర్గానికి ఆర్డర్ కాపీని అందజేసినట్లు తెలిపారు. ఈ మేరకు మహ్మద్ ఆలీని సస్పెండ్ చేస్తూ తీర్మానించినట్లు విండో పాలకవర్గ సభ్యులు శుక్రవారం సాయంత్రం తెలిపారు.



## కరుణించు వరుణదేవా!

వర్షాలు సమృద్ధిగా కురియాలని కోరుతూ ఎల్లారెడ్డి మండలంలోని కొక్కొండ గ్రామస్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక చెరువు నుంచి నీటిని తెచ్చి ఆలయాల్లో అభిషేకం నిర్వహించారు. హనుమాన్, సంగమేశ్వర, ముత్యాల పోచమ్మ, పెద్దమ్మ, బ్రహ్మదేవుడు, భూలక్ష్మమ్మ ఆలయాలను నీళ్లతో నింపారు.

– ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 9